# విజయదశమి ప్రాశస్త్యము.



విజయదశమి (దసరా) పండుగను ఆశ్వీయుజ మాసములో శుక్లపక్ష దశమిరోజు జరుపుకుంటాము. ఈ పండుగను చెడుపై మంచి విజయము సాధించిన సందర్భమును పురస్కరించుకొని జరుపుకుంటాము. పాడ్యమి మొదలుకొని నవమి వరకు మొదటి తొమ్మిది రోజులను దసరా నవరాత్రులని జరుపుకుని, పదవరోజు విజయదశమిగా జరుపుకుంటాము. క్రొత్త పనులను మొదలుపెట్టేందుకు శుభకరమైన రోజుగా దీనిని పరిగణిస్తాము. దక్షిణ భారతదేశములో దుర్గాదేవి మహిషాసురుని సంహరించిన రోజుగా తలుస్తారు. దుర్గాదేవి మహిషాసుర మర్దినిగా, చాముండేశ్వరిగాకూడా పిలువబడుతోంది. కర్ణాటక రాష్ట్రములోని మైసూరు దగ్గరలో మహిషాసుర సంహారము జరిగినట్లు జనులు విశ్వసిస్తారు. ఉత్తర భారతదేశములో ఈ పండుగను అయోధ్య రాకుమారుడైన శ్రీరామచంద్రుడు లంకాధిపతియైన రావణాసురునిపై విజయము సాధించిన సందర్భముగా జరుపుకుంటారు.

అలాగే మహాభారత కాలములో అజ్ఞాతవాసముగడుపుతున్న పాండవులు విరాటరాజు కొలువులోచేరేముందు వారి పవిత్రమైన, అతి శక్తివంతమైన వారి ఆయుధములను ఒక శమీవృక్షముపై ఉంచినట్లు, దుర్యోధనుడు పాండవుల ఆచూకి తెలుసుకొనడానికి గోగ్రహణమునకు పాల్పడినప్పుడు, అర్జునుడు ఆ శమీవృక్షమును పూజించి, దానిపైనుండి శస్త్రాస్త్రములను, విల్లును గైకొని కౌరవులపై విజయము సాధించినట్లుకూడా పలువురు విశ్వసిస్తారు.

ఈ రోజు తలపెట్టిన పనులన్ని విజయవంతమౌతాయని పలువురి నమ్మకము. పిల్లలు విద్యాబుద్ధులు అబ్బాలని చదువులతల్లి సరస్వతిని, వ్యాపారముచేసేవారు వ్యాపారము అభివృద్ధి చెందాలని లక్ష్మీదేవిని, స్త్రీలు తమ కుటుంబసభ్యులందరికీ ఆయురారోగ్యములు కలగాలని పార్వతిదేవిని కొలుస్తారు. ఈ రోజు ఆయుధపూజ చెయ్యడమనేది మన ఆచారము. విద్యను గరిపేవారు పుస్తకములను, దర్జీలు కుట్టుమిషన్లను, రైతులు ఎడ్లబండి, నాగలి, గొడ్డలి మొదలైనవాటిని, వాహనచోదకులు వారివారి వాహనములను, ఇలా వారికి జీవనోపాధిని కల్పిస్తున్న యంత్రపరికరములను అలంకరించి, పూజిస్తారు. దశమి అనగా చంద్రమానములో అమావాస్య అనంతరము వచ్చే శుక్లపక్షములో పదవరోజు. విజయమును కలిగించే దశమి కనుక, ఈ రోజు విజయదశమిగా ప్రాముఖ్యమును సంతరించుకొంది.

పూర్వము పల్లెలలో విజయదశమికి రెండు వారములు సెలవులు ఇచ్చేవారు. ఈ సమయములో వారు అవసరమైనచోట సేవాకార్యక్రమములు చేపట్టేవారు. ఈ విధముగా వారికి సమాజములో మనుగడ సాగించడానికి కావలసిన సామాజిక విలువలను తెలుసుకునేవారు. నేడు ఈ సంస్కృతి మరుగున పడిపోతోంది. ఎల్లప్పుడూ చదువు, చదువు, చదువు. దీని కారణముగా వారికి సమాజములో వ్యక్తులతో పరిచయము, సామాజిక సేవ వంటి విషయములతో పరిచయము ఏర్పడుటలేదు. ప్రపంచశాంతికొఱకు మనము అతి విలువైన సంస్కృతి, సంప్రదాయములను కొనసాగించడం అవసరం.

సర్వేజనా: సుఖినోభవంతు. ఓం శాంతి శాంతి శాంతి:

- సుశ్రీ.